క్లుప్తంగా

శాకంబరీదేవిగా వాసవీమాత


శాకంబరీ దేవి అలంకరణలో అమ్మవారు

యాడికి: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా శాకాంబరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, గంగా జలాలతో అభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, లలిత సహస్రనామావళి పఠించారు. అనంతరం 21 మంది దంపతులచే సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. కార్య క్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

భూ ఆక్రమణను అరికట్టండి


రజాపురంలో చదును చేసిన సర్వే నంబర్‌-6లోని ప్రభుత్వ భూమి

గుత్తి రూరల్‌: మండలంలోని రజాపురం గ్రామ శివారులో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వెనుక సర్వే నంబర్‌–6లో సుమారు 19 ఎకరాలను కొందరు ఆక్రమించుకున్నారని సర్పంచ్‌ విజయలక్ష్మి, గ్రామస్తులు కేశవులు, సీతారాముడు, మదనకామరాజు, మల్లికార్జున తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ సర్వే నంబర్‌–6లో ఉన్న సుమారు 72 ఎకరాలను బ్రిటీష్‌ హయాంలో పశువుల మేత, పచ్చిక బయలు కోసం వదిలేశారన్నారు. అందులో 10 ఎకరాలను గురుకుల పాఠశాలకు కేటాయించగా 62 ఎకరాలు మిగిలింది. అయితే ఇటీవల కొందరు తమకు 19 ఎకరాలకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం ఉందని, జేసీబీ యంత్రాలు పెట్టి భూమిని చదును చేశారన్నారు. రెవెన్యూ అధికారులు గ్రామానికి వచ్చి విచారణ చేయాలని వారు కోరారు. అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేసి ఉంటే, వెంటనే రద్దు చేయాలని లేని పక్షంలో కలెక్టర్‌, ముఖ్యమంత్రి, సీఎస్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

పొలం వివాదంలో ఘర్షణ

తాడిపత్రి రూరల్‌: మండలంలోని గంగాదేవిపల్లిలో ఆదివారం పొలం విషయమై జరిగిన ఘర్షణలో శీనా(32), మల్లికార్జునకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కొంత కాలంగా పొలం విషయంలో లక్ష్మీనారాయణ, శీనాకు మనస్పర్థలు ఉన్నాయి. వివాదం పెరగడంతో బావ, బావమరిది లక్ష్మీనారాయణ, ఓబులేసు కలసి అన్నదమ్ములు శీనా, మల్లికార్జునపై దాడికి దిగారు. దాడిలో శీనాకు తీవ్రగాయాలు కాగా, మల్లికార్జునకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఘనంగా గాలేమ్మ జాతర


అలంకరణలో గాలేమ్మ అమ్మవారు

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లిలో ఆదివారం గ్రామస్తులు ఆధ్వర్యంలో గాలేమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, హోమం, పూజలు చేశారు. అలాగే మహిళలు భక్తి,శ్రద్ధలతో బోనాలు తీసుకుని ప్రదర్శనగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామస్తులు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని జాతర నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం, ఆకుపూజ, అర్చనలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


తాడిపత్రి సత్యసాయి మందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


యాడికిలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు


బీకేఎస్‌ చెరువు కట్టపై ప్రత్యేక అలంకరణలో సాయిబాబా


చెరువు కట్టపై బాబా దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

సర్వం సాయిమయం

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షిర్డీ సాయిబాబా ఆలయాలతో పాటు అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే కాగడ హారతి, పంచామృతాభిషేకం, సాయి సత్య వ్రతం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదాల వినియోగం, పల్లకీ ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

- వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు
- కిటకిటలాడిన ఆలయాలు


తాడిపత్రిలోని శివ సాయి మందిరంలో షిర్డీ సాయి


పామిడిలోని మహాయోగి దత్తక్షేత్రంలో వేడుకలు నిర్వహిస్తున్న పీఠాధిపతి సురేంద్ర


గార్లదిన్నెలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా


గుంతకల్లులో సాయినాథుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


పెద్దవడుగూరులో అలంకరణలో సాయిబాబా


శింగనమలలో పూజలందుకున్న షిర్డీ సాయిబాబా


నార్పలలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

తాడిపత్రి: గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలోని షిర్డీసాయిబాబా ఆలయం, సంజీవనగర్‌లోని శివ సాయి బాబా ఆలయం, కడప రోడ్డులోని షిర్డీ సాయి బాబా ఆలయాల్లో వేకువజామునే పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక దత్తమందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. సంజీవనగర్‌లోని వేదగాయత్రి ఆలయంలో కొలువైన దత్తాత్రేయునికి విశేష పూజలు నిర్వహించారు.

భక్తులను ఆకట్టుకున్న భారీ సాయిబాబా విగ్రహం

స్థానిక సంజీవనగర్‌లో నూతనంగా నిర్మించిన శివ సాయిబాబా ఆలయంలో ప్రతిష్టించిన షిర్డీ సాయి బాబా విగ్రహం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. 25 అడుగడుల ఎత్తు ఉన్న ఈ విగ్రహాన్ని రాజస్థాన్‌ నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి ఇక్కడ ప్రతిష్టించారు. భారీ విగ్రహాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

తాడిపత్రి రూరల్‌: మండలంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలోని షిర్డీ సాయిబాబా లయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

యాడికి: మండల కేంద్రంతోపాటు రాయల చెరువు, నగరూరు గ్రామాల్లోని సాయిబాబా మందిరంలో విశేష పూజలు నిర్వహించారు.

పెద్దవడుగూరు: మండలంలోని పెద్దవడుగూరు, క్రిష్టిపాడు, అప్పేచర్ల తదితర గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం బాబా ప్రతిమలను ట్రాక్టర్‌పై ఉంచి, ఊరేగించారు.

శింగనమల: శింగనమల చెరువు కట్ట వద్ద ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో శింగనమల, గోవిందరాయునిపేట, సోదనపల్లి, చిన్నజలాలపురం, వెస్ట్‌ నరసాపురం, కొర్రపాడు, శివపురం గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నె, కోటంక, కల్లూరు, కనంపల్లిలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

యల్లనూరు: మండలంలోని యల్లనూరు, తిమ్మంపల్లి, గిర్రమ్మబావి సమీపంలోని సాయి మందిరాలు సర్వాంగ సుందరంగా అలంకరించారు. యల్లనూరు కస్తూర్బా విద్యాలయం వద్ద ఉన్న ఆలయంలో సాయిపాద స్పర్శ దర్శనంతో పాటు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలను నిర్వహించారు.

నార్పల: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం మండలంలోని చెరువు కట్టపై వెలసిన శిరిడి సాయి బాబ దేవాలయంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా భక్తులతో చెరువు కట్ట కిటకిటలాడింది. ఉదయాన్నే సాయిబాబ దర్శనం కోసం భక్తులు బారులు తీశారు. శిరిడి సాయిబాబ దేవాలయంలో ఎక్కడ చూసినా ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి...సాయిరాం..సాయిరాం ఓం సాయిరాం అంటూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 6 గంటలకు కాకడ హారతి, 6.30కి అఖండ భజన పంచస్నాన పూజ, 7.30కి అభిషేకములు, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, నిర్వహించారు. సాయంత్ర స్వామి వారిని ఊరేగించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమ నిర్వహించారు.

గుంతకల్లుటౌన్‌: పట్టణంలోని ఆలూరురోడ్డు, కసాపురం రోడ్డు వద్ద ఉన్న షిర్డీసాయినాథుడి ఆలయాలు సాయినామస్మరణతో మార్మోగాయి. ఆలూరు రోడ్డు ఆలయంలో ప్రీతి నర్సింగ్‌ హోమ్‌ అధినేత్రి డాక్టర్‌ సరోజమ్మ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే ఆలూరు రోడ్డు వద్ద ఉన్న గురురాఘవేంద్ర స్వామి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

సేవాగఢ్‌లో ఘనంగా గురు పౌర్ణమి

గుత్తి రూరల్‌: మండలంలోని సేవాగఢ్‌లో ఉన్న సేవాలాల్‌ మహారాజ్‌ ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్య క్రమంలో సేవాలాల్‌ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్‌, సంయుక్త కార్యదర్శి అశ్వత్థనాయక్‌, కోశాధికారి బాలానాయక్‌, సభ్యులు, అర్చకులు మారుతీ ప్రసాద్‌, పురుషోత్తమాచార్యులు, శ్రీనివాసాచార్యులు , భక్తులు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తిలోని షిరిడీ సాయిబాబా ఆలయం, గుత్తి ఆర్‌ఎస్‌లోని గౌతమేశ్వరాలయంలో గురు పౌర్ణమి వేడుకలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు జేకే రాము, రాజేంద్ర, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి యక్కల మహేష్‌, నారాయణస్వామి, గురు తదితరులు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక పెన్నానదిలోని షిర్డిసాయిబాబా ఆలయం, మెయిన్‌ బజార్‌లో బాబా ఆలయం, వడ్డేవీధిలోని దత్త మహాపీఠం , పొగరూరు ఎన్‌హెచ్‌–44 సమీపంలోని బాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు.


యల్లనూరులో పూజలందుకున్న సాయిబాబా


గుత్తి రూరల్‌: అలంకరణలో సేవాలాల్‌ మహారాజ్‌ విగ్రహం


గుత్తిలోని సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం


యాడికి మండల కేంద్రంలోని సాయిబాబా


తాడిపత్రి రూరల్‌: మండలంలోని సజ్జలదిన్నెలో విశేష అలంకరణలో సాయిబాబా

ఆలయం వద్ద వైద్య శిబిరం

తాడిపత్రిటౌన్‌: పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న సాయిబాబా ఆలయం వద్ద గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని ఆర్‌ఎంపీ, ఏపీఎంపీఏ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎంపీ అధ్యక్షుడు క్రిష్ణా, సెక్రటరీ భోజరాజు, ఓబులేసు, నాగయ్య, ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

గురువుకు సత్కారం

తాడిపత్రిటౌన్‌: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ఉపాధ్యాయుడు నటరాజ్‌ను బీజేపీ పట్టణ అధ్యక్షుడు మైదుకూరు ఆంజనేయులు శాలువా, పూలహారాలతో సత్కరించారు. మున్సిపల్‌ ప్రకాశం హైస్కూల్‌లో చదువుకున్న రోజుల్లో ఉపాధ్యాయుడు క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పారని ప్రశంసించారు.

ఘనంగా ఉట్ల పరుష


ఉట్టి పగలగొడుతున్న భక్తులు


రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం

పామిడి: పట్టణంలో రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకొని ఉట్ల పరుషను ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఆయా ఫిర్కాల ఆధ్వర్యంలో వేర్వేరుగా రుక్మిణీపాండురంగస్వామి సతీసమేత ధైయిండీ రథోత్సవ కార్యక్రమాలను భావసారక్షత్రియ భజన బృందం దిండి భజనల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం రెండు రథోత్సవాలు వేర్వేరుగా ఉట్లమాను వద్దకు చేరుకున్నాయి. ఉదయం రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలోనూ, సాయంత్రం డబ్బేదార్‌ ఫిర్కా ఆధ్వర్యంలో ఈ ఉట్ల పరుష చేపట్టారు. పరుషకు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి జనం తరలి రావడం విశేషం. తేరును పురస్కరించుకొని సీఐ ఎం రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ బెస్తరాజు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎంపీడీఓ ఏ శ్రీనివాసరావు దంపతులు, ఈఓ క్రిష్ణయ్య, ఉట్ల పరుషను పర్యవేక్షించారు.

కడవకల్లులో గర్భకోశ చికిత్స శిబిరం


పాడి రైతులకు సూచనలిస్తున్న అధికారులు

పుట్లూరు: మండలంలోని కడవకల్లులో ఆదివారం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు గణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణాధికారి, డిప్యూటీ డైరెక్టర్‌ సుధాకర్‌ భవిష్యత్తులో 90 శాతం కచ్చితత్వంతో పెయ్య దూడల పుట్టుక ఉద్దేశించి లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయు పథకంపై అవగాహన కల్పించారు. రూ.1,350 విలువ చేసే రెండు ఇంజెక్షలను రూ.850 సబ్సిడీతో రూ.500కు పెయ్య దూడలను పొందే ఇంజెక్షన్లను ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. రెండు ఇంజెక్షన్లు వేసినా ఫలితం లేకపోతే రూ.500 రైతులకు వెనక్కు ఇస్తామన్నారు. ఈ సూదుల వల్ల కుర్ర దూడ పుడితే రూ.250 తిరిగి చెల్లిస్తారన్నారు. కృత్రిమ గర్భధారణ విదేశీ జాతులనే కాకుండా స్వదేశీ జాతులైన గిర్‌, సాహివాల్‌, తార్పార్కార్‌ వంటి బ్రీడ్‌లను రైతులు ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి నాగసువర్ణ, రైతులు పాల్గొన్నారు.

నారాయణుడి కల్యాణోత్సవం


కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా కల్యాణోత్సవాన్ని అర్చకులు సుధీర్‌కుమార్‌శర్మ, సునీల్‌కుమార్‌శర్మ, బాలసుబ్రమణ్యశర్మ ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి వేడుకలను వీక్షించారు. ప్రతి నెలా భక్తుల కోరిక మేరకు పౌర్ణమి రోజున స్వామి కల్యాణం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోందని ఈఓ సుబ్రమణ్యం తెలిపారు. అలాగే గురుపౌర్ణమి పురస్కరించుకుని నరసాపురం, చిన్నపపప్పూరు, రామకోటి, ముచ్చుకోట గ్రామాల్లోని షిర్డిసాయినాథుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నపప్పూరులో సాయినాథుని దర్శనం కోసం విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకుడు, సీవీ రామన్‌ విద్యాసంస్థల చైర్మన్‌ బిందెల భాస్కర్‌ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

25 నుంచి కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు

గుత్తి రూరల్‌: మండలంలోని పూలకుంట గ్రామంలో చిన్న పీర్ల పండుగను పురస్కరించుకుని ఈ నెల 25 నుంచి కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 25న చిన్న సరిగెత్తు, 26న విడిదినం, 27న పెద్ద సరిగెత్తు, 28న జలధి కార్యక్రమం ఉంటుందన్నారు. 27న పెద్ద సరిగెత్తు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

చర్చిలో ఆరాధనోత్సవం

పామిడి: పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్‌ రెవరెండ్‌ బీ విశ్వమోహన్‌ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు.

మొక్కలు నాటిన నాయకులు

పుట్లూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలో బీజేపీ నాయకులు అమ్మ కోసం చెట్టు కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంకాల్‌రెడ్డి, లీగల్‌ సెల్‌ కన్వీనర్‌ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాలు

యల్లనూరు: పాడి రైతులకు ప్రభుత్వం రాయితీపై గడ్డి విత్తనాలను అందిస్తున్నట్లు ఇన్‌చార్జ్‌ ఏడీ ఖాదర్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు గడ్డి విత్తనాలు యల్లనూరు పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. కిలో గడ్డి విత్తనాలు రూ.92 కాగా 75 శాతం రాయితీతో రైతు వాటా కింద కిలోకు రూ.23 చెల్లిస్తే 20 కిలోల వరకు ఇస్తామన్నారు. రైతులు ఆధార్‌, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌ తీసుకు రావాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే పశువైద్యశాలలో లైవ్‌స్టాక్‌ అసిస్టెంట్‌ రేష్మ, కంప్యూటర్‌ ఆపరేటర్‌ శ్రీనివాసరెడ్డిని సంప్రదించాలన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోటరీ క్లబ్‌ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్త దానం చేస్తున్న దృశ్యం

తాడిపత్రి: పట్టణంలో రోటరీ క్లబ్‌ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆంజనేయ స్వామి విగ్రహం వెనుక వైపు ఉన్న రోటరీ క్లబ్‌ ప్రాంగణంలో నిర్వహించిన శిబిరంలో దాదాపు 40 మంది రక్తదానం చేసినట్లు క్లబ్‌ అధ్యక్షుడు సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో క్లబ్‌ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తి రూరల్‌: మండలంలోని బసినేపల్లి శివారులో ఆదివారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి సునీల్‌ అనే యువకుడు గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. బసినేపల్లికి చెందిన సునీల్‌ ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా.. గ్రామ శివారులో బైక్‌ అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడ్డ అతడిని కుటుంబసభ్యులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్‌ స్టేషన్‌ తనిఖీ

గార్లదిన్నె: స్థానిక పోలీస్‌ స్టేషన్‌ను ఆదివారం అనంతపురం డీఎస్పీ వెంకటశివారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో శాంతిభద్రతలు విఘాతం కలుగకుండా చూడాలని పోలీసులకు సూచించారు. అనంతరం ఈనెల 13న పోలీస్‌ స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ చేశారని ఎస్‌ఐ మహమ్మద్‌ గౌస్‌ తెలిపారు.

ఐదుగురి అరెస్ట్‌

పెద్దవడుగూరు: మండలంలోని పి.వీరన్నపల్లిలో రైతు రెడ్డప్పరెడ్డి పొలంలో 150 మామిడి చెట్ల నరికివేత కేసులో ఐదుగురిని అరెస్ట్‌ చేసినట్లు ఎస్‌ఐ చిన్న రెడ్డప్ప తెలిపారు. ఫిర్యాదు మేరకు గోపాల్‌, శ్రీనివాసులు, రాఘవేంద్ర, వెంకటస్వామి, నాగభూషణను ఆదివారం అరెస్ట్‌ చేసి, కోర్టుకు హాజరు పరిచామన్నారు.